సాక్షి
విశాఖపట్నం

సోమవారం । 19 । మే । 2025



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, నగర ప్రజలు

వీరులకు వందనం

మార్మోగిన భారత్ మాతాకీ జై నినాదం

ఏయూక్యాంపస్: సాగర తీరం ఆదివారం సాయంత్రం త్రివర్ణమయంగా మారింది. ఆపరేషన్ సిందూర్, సైనికులకు మద్దతుగా బీచ్‌రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు జాతీయ జెండాలను పట్టుకొని.. భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. ఉగ్రవాదంపై పోరులో కేంద్రానికి, సైన్యానికి అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ భారతీయ త్రివిధ దళాల సామర్థ్యాలు అనిర్వచనీయమన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మాజీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామ రాజు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా చందు

రాష్ట్ర యువజన వింగ్ ప్రధాన కార్యదర్శిగా దొడ్డి కిరణ్



ఉరుకూటి చందు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఉరుకూటి రామచంద్రరావు(చందు) నియమితులయ్యారు. ప్రస్తుత యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్న దొడ్డి కిరణ్‌ను రాష్ట్ర యువజన వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

షిప్‌యార్డు అధికారి భానుప్రియకు అరుదైన గుర్తింపు



భానుప్రియను సత్కరిస్తున్న కేంద్రమంత్రి శర్బానంద సోనోవాల్

సాక్షి, విశాఖపట్నం: మారీటైమ్ డిజైన్, ఇన్నోవేషన్‌లో అద్భుతంగా రాణిస్తున్న హిందూస్తాన్ షిప్‌యార్డ్ డిజైన్ అండ్ బీడీడీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.భానుప్రియకు అరుదైన గుర్తింపు లభించింది. ముంబైలోని శాంటాక్రూజ్‌లో అంతర్జాతీయ మారీటైమ్ వుమెన్స్‌డే ఆదివారం నిర్వహించారు. గ్రీన్ షిప్ బిల్డింగ్ టెక్నాలజీ అభివృద్ధి, హైడ్రోజన్ పవర్డ్ టగ్స్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన భానుప్రియకు ప్రత్యేక ఆహ్వానం అందింది. మారీటైమ్ ఇండస్ట్రీ భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచారంటూ భానుప్రియని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్, షిప్పింగ్ డీజీ సాగర్ మెయిన్ సమ్మాన్ చేతుల మీదుగా సత్కంచారు. భానుప్రియకు అరుదైన గుర్తింపు లభించడంపై హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ కమొడర్ హేమంత్ ఖత్రి అభినందనలు తెలిపారు.

సరస్వతీ పుష్కరాలకు సూపర్ లగ్జరీ సర్వీసులు



విశాఖ డిపోలో సిబ్బందికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం: కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు విశాఖ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మద్దిలపాలెంలో గల విశాఖపట్నం డిపోను తనిఖీ చేశారు. సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈనెల బీట్ ది హీట్ థీమ్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. తెలంగాణలో కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు వెళ్లే వారు ముందుగా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. రిజర్వేషన్ కోసం 9958225602, 8309265666, 7382914264 నెంబర్లు సంప్రదించాలన్నారు. సాలూరులో జరగనున్న శ్రీ శ్యామలాంబ జాతరకు ఈనెల 22వ తేదీ వరకు విశాఖపట్నం నుంచి సాలూరు, విజయనగరానికి సుమారు 100 బస్సులు నడుపుతున్నామన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీకి ప్రతిష్ఠాత్మక అవార్డులు



తుస్కర్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: కేరళలోని త్రివేండ్రంలో ఐసీటీఈపీ కౌన్సిల్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తుస్కర్ అవార్డు–25'లో సింహాద్రి ఎన్టీపీసీకి పలు బంగారు, వెండి అవార్డులు లభించాయి. కమ్యూనిటీ అభివృద్ధి, ప్రభావవంతమైన ప్రజా నిబద్ధత పట్ల ప్రాజెక్టు అవలంబిస్తున్న విధానానికి ఈ అవార్డులు దక్కాయి. సింహాద్రి ఎన్టీపీసీ ఓఓహెచ్ విభాగానికి 'గోల్డ్ ఇన్ ఎక్సలెన్స్'అవార్డు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) విభాగానికి 'సిల్వర్ ఫర్ ఎక్సలెన్స్' అవార్డులు లభించాయి. అవార్డుల ప్రదాన కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ శశి థరూర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి సిహెచ్ కురియన్, కేరళ ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి జి.ఆర్.అనిల్, సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కూటమిలో సిగపట్లు!

డిప్యూటీ మేయర్ పదవి కోసం పోటా పోటీ



- తమకే ఇవ్వాలని పట్టుబడుతున్న జనసేన
- ఈ కుర్చీ కూడా తమకే కావాలంటున్న టీడీపీ
- తమ నియోజకవర్గాల కార్పొరేటర్లకు ఇవ్వాలని ఇద్దరు ఎమ్మెల్యేల పట్టు
- తన అనుచరుడిని కుర్చీలో కూర్చోబెట్టేందుకు మేయర్ మంతనాలు
- నేడు డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం: కుట్ర, కుతంత్ర రాజకీయాలు చేస్తూ.. నీతినియమాలను బంగాళాఖాతంలో కలిపేసి.. బీసీ మహిళా మేయర్‌ను పదవీచ్యుతురాల్ని చేసిన కూటమి పార్టీలు.. ఇప్పుడు అదే రాజకీయ పోరులో సిగపట్లు పడుతున్నాయి. ప్రలోభాలు, భయపెట్టే రాజకీయాలతో కార్పొరేటర్లను తమ వైపునకు తిప్పుకున్న కూటమి నేతలు.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ పదవి కోసం ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటున్నారు. తమ పార్టీకే ఈ కుర్చీ కేటాయించాలని జనసేన పట్టుబట్టగా.. రెండు పీఠాల్లోనూ తమ కార్పొరేటర్లే కూర్చోవాలంటూ టీడీపీ రాజకీయం చేస్తోంది. అదే సమయంలో టీడీపీలోనూ గ్రూపు కుంపట్లు రాజుకున్నాయి. తన అనుచరుడికే కావాలంటూ ఎమ్మెల్యేలు, మేయర్ పావులు కదుపుతూ వెన్నుపోటు రాజకీయాలకైనా వెనకాడబోమంటూ సవాల్ విసురుకుంటున్నారు. ఎవరికివారే అన్న రీతిలో వర్గపోరు కుమ్ములాటల నడుమ నేడు డిప్యూటీ మేయర్ పేరును ఖరారు చేస్తారా లేదా అనేది సందిగ్ధంగా మారింది.

జనసేనలో కుమ్ములాటలు

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవి దక్కించుకునేందుకు టీడీపీ, జనసేన పార్టీల మధ్య వర్గ పోరు మొదలైంది. దీనిపై ఆయా పార్టీల అధినాయకులు తేల్చకపోవడంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. టీడీపీలో పది మంది వరకు ఈ పదవి కోసం పోటీ పడుతుండగా.. జనసేనలో ఉన్న 14 మందిలో 13 మంది రేసులో ఉన్నామంటూ హడావుడి చేస్తున్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో జనసేన గుర్తుపై గెలిచింది ముగ్గురే కాగా.. ప్రలోభాల వలలో పడి వైఎస్సార్‌సీపీ నుంచి 11 మంది కార్పొరేటర్లు ఆ పార్టీ పంచన చేరారు. కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తనకు తప్ప జనసేనకు చెందిన ఎవరికైనా డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలనీ.. లేదంటే రాజీనామా చేస్తానని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసిన విషయం విదితమే. మిగిలిన ఇద్దరిలో పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి రేసులో ఉన్నా.. అదే గవర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి మేయర్ పదవిలో ఉన్నారు. దీంతో ఆమెను పరిగణనలోకి తీసుకోవడం లేదు. మరో కార్పొరేటర్ దల్లి గోవింద్‌రెడ్డి అవినీతి వ్యవహారాలపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పార్టీ అతడిపై గుర్రుగా ఉంది. ఈ ఫిర్యాదుల వెనుక ఇటీవలే జనసేన కండువా కప్పుకున్న కార్పొరేటర్ల హస్తం ఉందని అంతా భావిస్తున్నారు. ఈ ముగ్గురూ తప్పుకుంటే.. తమకే డిప్యూటీ మేయర్ పదవి వస్తుందనే ఉద్దేశంతో ఈ ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తుండటంతో.. వీరి మధ్య అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయి.

టీడీపీలోనూ వర్గపోరు

మేయర్ పీఠాన్ని దక్కించుకున్న టీడీపీ.. డిప్యూటీ మేయర్ పీఠాన్ని వదులుకోకూడదని భావిస్తోంది. తమ పార్టీ నుంచే ఒకరికి ఈ పదవి కట్టబెట్టాలని పావులు కదుపుతోంది. ఇదే సమయంలో పార్టీలో వర్గ పోరు మొదలైంది. తన నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్ గొలగాని మంగవేణికి ఇవ్వాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, తన నియోజకవర్గానికి చెందిన మొల్లి హేమలతకు ఇవ్వాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పట్టుబడుతున్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు తన అనుచరుడైన గంధం శ్రీనివాసరావును ఈ కుర్చీపై కూర్చోబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం టీడీపీలో మూడు ముక్కలాటగా తయారైంది. మిగిలిన కార్పొరేటర్లు కూడా తమకు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలంటూ ఇప్పటికే అధిష్టానం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎవరికి వారు ఈ పదవి కోసం పోటీ పడుతుండడంతో టీడీపీ, జనసేన అధినాయకులు కూడా దీనిపై ఏటూ తేల్చలేక చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. ఆయా పార్టీల అధిష్టానాలు జోక్యం చేసుకుంటాయా? లేదా స్థానిక నేతలకే నిర్ణయాన్ని వదిలేస్తాయా? అనే దానిపై ఇంకా సందిగ్ధత నెలకొంది.

హనీట్రాప్ కేసులో కీలక ముఠా సభ్యుడి అరెస్ట్

భీమునిపట్నం: హనీట్రాప్ కేసులో కీలక ముఠా సభ్యుడిని ఆదివారం భీమిలి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితురాలు జాయ్ జెమీమా పలువురిని ట్రాప్ చేసి.. వారి నుంచి లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఆమెను ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈ ముఠాకు చెందిన కొందరిని గతంలోనే అదుపులోకి తీసుకున్నారు. తాజాగా ముఠాలోని కీలక సభ్యుడైన గ్లోబల్ ఐటీసీ కంపెనీ సీఈవో పోలమరశెట్టి రత్నరాజును విశాఖ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భీమిలి సీఐ తిరుమలరావు, సిబ్బంది అరెస్ట్ చేశారు. రత్నరాజు, జాయ్ జెమీమా మధ్య భారీగా నగదు లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. పూర్తి ఆధారాలతో నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం అతనికి రిమాండ్ విధించింది.

నో బోరింగ్.. ఎయిర్‌పోర్టులో గేమ్స్ జోన్



గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ నమూనా

- విమానాశ్రయంలో గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్
- టెండర్లు ఆహ్వానించిన ఏఏఐ
- ఏడాదిలోగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక

సాక్షి, విశాఖపట్నం: దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో వృద్ధి నమోదవుతుండటంతో విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో సరికొత్త సౌకర్యాలు కల్పించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇప్పటికే దేశంలో ప్రధాన నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఏఏఐ.. విశాఖలోనూ ఈ తరహా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. బోర్డింగ్ కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులకు బోర్ కొట్టకుండా.. పిల్లలతో కలిసి కాసేపు ఆనందంగా గడిపేలా ఈ గేమ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

గత ఏడాది వరకు డొమెస్టిక్, ఇంటర్నేషనల్ సర్వీసులతో కళకళలాడిన విశాఖ విమానాశ్రయం.. ప్రయాణికుల రాకపోకల్లో గణనీయ వృద్ధి సాధించింది. దీంతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమైంది. అయితే గత ఆరు నెలలుగా సర్వీసుల రద్దు, కొత్త సర్వీసులు అర్ధాంతరంగా నిలిచిపోవడం వంటి వాటితో ఎయిర్‌పోర్టు ఒడిదొడుకులు ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం, ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎయిర్‌పోర్టు వెనుకబడింది. అయితే ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తీవ్రంగా కృషి చేస్తూ.. ఎయిర్‌లైన్స్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. వైజాగ్ ఎయిర్‌పోర్టును తిరిగి పుంజుకునేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఏఏఐ కూడా మద్దతుగా నిలుస్తోంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే విశాఖ ఎయిర్‌పోర్టులో గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు టెండర్లు ఆహ్వానించింది.

మొదటి అంతస్తులో ఏర్పాటు

ఎయిర్‌పోర్టు మొదటి అంతస్తులో డొమెస్టిక్ షా (సెక్యూరిటీ హోల్డ్ ఏరియా) ప్రాంతంలోని 14 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ గేమ్ సెంటర్ రాబోతోంది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ టెర్మినల్స్‌ను అనుసంధానించేలా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు టెండర్లలో స్పష్టం చేశారు. పిల్లలు ఆడుకునేందుకు చిన్న చిన్న జాయ్‌రైడ్స్, వీడియో గేమ్స్, పెద్దలు, యువత కాసేపు ఎంజాయ్ చేసేలా ప్లే స్టేషన్, రిలాక్సింగ్ సెంటర్ అందుబాటులోకి రానున్నాయి. విమానాశ్రయ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విమానాశ్రయ కార్యకలాపాలు, ఎయిర్ నావిగేషన్ సేవల నిర్వహణ, నియంత్రణపైనే కాకుండా.. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఏఏఐ ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. టెండర్లు ఖరారు చేసిన ఏడాదిలోపు గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ అందుబాటులోకి వస్తుందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

అయ్యవార్లు.. అడ్డదారులు..!

- తప్పుడు సర్టిఫికెట్లతో తిష్ట
- బదిలీ తప్పించుకునేందుకు పుట్టుకొచ్చిన రోగాలు
- మెడికల్ బోర్డు పరిశీలనతో వెలుగులోకి..
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 442 మందిపై నిశిత పరిశీలన
- వీరిలో సగానికి పైగా గత సర్టిఫికెట్ల తిరస్కరణ



డీఈవో కార్యాలయం

విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీల కోసం జిల్లా విద్యాశాఖ చేస్తున్న కసరత్తులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారులను బురిడీ కొట్టించి.. ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన కొంతమంది అయ్యవార్ల బాగోతం బట్టబయలైంది. బదిలీల్లో కోరుకున్న స్థానం పొందేందుకు వైద్యపరమైన కారణాలను చూపిస్తూ.. ఉపాధ్యాయులు సమర్పించిన సర్టిఫికెట్లలో సగానికి పైగా జిల్లా స్థాయి మెడికల్ బోర్డు తిరస్కరించటం ఇప్పుడు హాట్ టాఫిక్‌గా మారింది. సదరు ఉపాధ్యాయులు గతంలో తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారా..? వైద్యుల ధృవీకరణలోనే లోపం జరిగిందా..? అప్పట్లో ఉన్న వ్యాధులు/వైకల్యం ఇప్పుడు సాధారణ స్థితికి వచ్చేశాయా..? అనేది తేలాల్సి ఉంది.

అసలేం జరిగిందంటే..

వైద్యపరమైన ఇబ్బందులు ఉన్న ఉపాధ్యాయులు ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద బదిలీ మినహాయింపు కోరుకునే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలాంటి వారు సుమారుగా 1,200 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 56 శాతానికి పైగా వైకల్యం, వ్యాధి తీవ్రత ఉన్నట్లుగా గతంలో మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించిన ఉపాధ్యాయులు.. ప్రస్తుత బదిలీల్లో మినహాయింపు పొందేందుకు జిల్లా స్థాయి మెడికల్ బోర్డు ముందు హాజరై.. ధ్రువీకరించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత నెల 24, 25, 26 తేదీల్లో మెడికల్ బోర్డు పరీక్షలు నిర్వహించింది.

సగానికి పైగా తిరస్కరణ

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 442 మంది ఉపాధ్యాయులు మెడికల్ బోర్డు ముందు హాజరయ్యారు. ఆర్థోపెడిక్‌కి(ఓహెచ్) సంబంధించి 102 మంది, కంటికి సంబంధించి 68 మంది, క్యాన్సర్‌కి సంబంధించి 43, గుండె సంబంధిత 43 మంది, మిగతా వ్యాధులకు సంబంధించి 186 మంది ఉన్నారు. మెడికల్ సర్టిఫికెట్లను రెండు రోజుల క్రితం కేజీహెచ్ పాలనాధికారులు డీఈవోకు పంపించారు. సర్టిఫికెట్లు పరిశీలనతో ఆసక్తి కరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమ ముందు హాజరైన ఉపాధ్యాయుల్లో సగానికి పైగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తించదని మెడికల్ బోర్డు ధృవీకరించటం సర్వత్రా చర్చనీయాంశమైంది. అలాగే ప్రిఫరెన్షియల్ కేటగిరీలో 56 శాతానికి పైన ఉన్న 158 మంది ఉపాధ్యాయులు ఎక్కడ దొరికిపోతామోననే బోర్డు ముందు హాజరుకాలేదని తెలుస్తోంది.

సర్టిఫికెట్ల జాప్యం వెనుక మతలబేమిటో.?

కేజీహెచ్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో గత నెల 24, 25, 26 తేదీల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించారు. మెడికల్ బోర్డులో సభ్యులైన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఈనెల మొదటి వారంలోనే ధృవీకరించారు. కానీ ఉపాధ్యాయ సంఘాలు ఫిర్యాదు చేసేంత వరకు మెడికల్ సర్టిఫికెట్లు డీఈవో కార్యాలయానికి చేరకపోవటం అనేక అనుమానాలకు తావిస్తోంది. జాప్యం వెనుక దాగి ఉన్న మర్మమేంటనేది తేలాల్సి ఉంది.

తప్పుడు సర్టిఫికెట్లపై చర్యలు ఉంటాయా..?

ఉపాధ్యాయులు సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లు పరిశీలన నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన తప్పిదాల మేరకు, చర్యలు ఎలా ఉంటాయనేది ఉపాధ్యాయ వర్గాల్లో సర్వత్రా చర్చనీయాంశమైంది. 10 మంది వరకు ఉపాధ్యాయులు గతంలో బదిలీ తప్పించుకునేందుకు సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లు తప్పుడువని తేలినట్లు తెలిసింది. అలాంటి వారిపై శాఖపరంగా చర్యలు ఎలా ఉంటాయి..?. తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులను బాధ్యులను చేస్తారా..? అనేది తేలాల్సి ఉంది.

వారి సంగతేంటి?

56 శాతంలోపు వైద్యపరమైన ఇబ్బంది ఉన్న వారికి బదిలీల్లో 5 పాయింట్లు ఇవ్వనున్నారు. గతంలో వీరు సమర్పించిన సర్టిఫికెట్లపై పరిశీలన లేదు. అయితే 56 శాతానికి పైగా వైకల్యం, వ్యాధి తీవ్రత ఉన్న వారిలోనే సగానికి పైగా ప్రిఫరెన్షియల్ కేటగిరి కిందకు రారని మెడికల్ బోర్డు పరిశీలనలో తేలింది. 56 శాతంలోపు ఉన్న సుమారు 600 మంది మెడికల్ సర్టిఫికెట్లలో వాస్తవికత ఎంతనేది పరిశీలన చేయాలని ఉపాధ్యాయులు అంటున్నారు.



అలల పోటు తక్కువగా ఉన్నప్పుడు నది ప్రవాహానికి ఇరువైపులా పేరుకుపోయిన ఇసుక

నీటి ప్రవాహంలో మార్పు రావడంతో ఒకవైపునకు తిరిగి ప్రవహిస్తున్న నది

ఉధృతంగా ప్రవహిస్తున్న నది

నీటితో నిండుగా ఉన్న నది

సాగర సంగమం.. ప్రతీ సారి కొత్తగా..

మీరు ఎప్పుడైనా భీమిలి బీచ్‌కు వచ్చారా? జిల్లాలోని మిగతా బీచ్‌ల కంటే ఈ బీచ్ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ ఉన్న లైట్‌హౌస్ దగ్గర నుంచి తీరం ఒంపులు తిరుగుతూ కనిపిస్తుంది. చూడటానికి భలే ముచ్చటగా ఉంటుంది. అంతేకాదు.. గోస్తనీ నది సముద్రంలో కలిసే 'సాగర సంగమం' ఇంకా అద్భుతంగా ఉంటుంది. తూర్పు కనుమల్లోని అనంతగిరి కొండల్లో జన్మించిన గోస్తనీ నది విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ప్రవహించి, చివరకు భీమిలి వద్ద సముద్రంలో కలుస్తుంది. అయితే సముద్రంలో కలిసే ముందు ఇక్కడి విశాలమైన ప్రాంతంలో నీళ్లు నిలిచిపోయి.. అదొక ప్రత్యేక నదిలాగా కనిపిస్తుంది. నీళ్లు తగ్గినప్పుడు ఇసుక తిన్నెలు కూడా ఏర్పడతాయి. ఈ ప్రదేశం ఎప్పుడూ ఒకేలా ఉండదు. నీళ్ల ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ఒకలా, తక్కువగా ఉన్నప్పుడు మరోలా ఉంటుంది. దీని వల్ల ఈ రోజు మీరు చూసిన దృశ్యం కొన్ని రోజుల తర్వాత పూర్తిగా మారిపోతుంది. మళ్లీ చూసినప్పుడు నది మరోచోట సముద్రంలో కలుస్తున్నట్లు కనిపిస్తుంది. ఇసుక తిన్నెలు కూడా వేరే ఆకారంలో ఉంటాయి. ఇలాంటి మార్పులు ఈ సాగర సంగమం దగ్గర మాత్రమే కనిపిస్తాయి. అందుకే ఇక్కడికి వచ్చే సందర్శకులకు ప్రతీసారి ఒక కొత్త అనుభూతి కలుగుతుంది. 'అరే.. పోయినసారి వచ్చినప్పుడు ఇలా లేదు కదా!' అని ఆశ్చర్యపోవడం ఖాయం. - భీమునిపట్నం

అలల చెంత.. 'రంగుల' కలగానే.!



దాదాపు ఐదేళ్ల కిందట భారీ తుఫాన్‌తో అలల ధాటికి కొట్టుకువచ్చి, తెన్నేటి పార్క్ ఒడ్డుకు చేరిన ఎంవీ మా షిప్.. ప్రస్తుతం పర్యాటక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ షిప్‌ను చూసేందుకు ప్రతి రోజూ పర్యాటకులు వస్తున్నారు. అయితే కేవలం చూడటమే కాదు.. ఈ భారీ షిప్ ఎప్పుడు రెస్టారెంట్‌గా రూపుదిద్దుకుంటుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి ఈ షిప్‌ను పర్యాటక డెస్టినేషన్‌గా మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో టూరిజం శాఖ సిద్ధమైంది. అన్ని అనుమతులు తీసుకొని పర్యాటక కేంద్రంగా మార్చాలని అనుకుంది. కానీ ఎన్నికలు రావడం, ఆ తర్వాత కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి. ఇటీవల కాలంలో ఈ షిప్‌కు మళ్లీ రంగులు వేయడం మొదలుపెట్టినా.. ఒకవైపు మాత్రమే వేసి మధ్యలో వదిలేశారు. ఈ షిప్ రెస్టారెంట్‌గా మారి సరికొత్త అనుభూతినిస్తుందని పర్యాటకులు ఎదురుచూస్తుండగా.. వారి ఆశ మాత్రం కలగానే మిగిలిపోతోంది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

‘రెడ్ బుక్’లో తెలుగుతల్లి పేరు రాశారేమో?

- భాషోద్యమకారుల ఎద్దేవా
- తెలుగు మనుగడకే ప్రశ్నార్థకంగా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు
- మద్దిలపాలెంలో అర్ధనగ్న ప్రదర్శన



మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద అర్ధనగ్న నిరసన

మద్దిలపాలెం: రాష్ట్ర విద్యాశాఖామంత్రి లోకేశ్ తన రెడ్ బుక్‌లో తెలుగుతల్లి పేరు రాసుకున్నారేమో అని తెలుగు భాషోద్యమకారులు ఎద్దేవా చేశారు. తెలుగు భాషా పరిరక్షణ కోసం ఆదివారం మద్దిలపాలెం కూడలిలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన జరిగింది. తెలుగుదేశం పార్టీ పేరులో ‘తెలుగు’ఉన్నప్పటికీ.. వారి నిర్ణయాలు తెలుగుకు వ్యతిరేకంగా ఉన్నాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు తెలుగు భాష మనుగడ లేకుండా చేసేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన తొమ్మిది అంచెల విద్యా విధానం తెలుగు భాష మనుగడను ప్రశ్నార్థకం చేయడమే కాకుండా చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం ద్వారా తెలుగు భాష ప్రాముఖ్యత తగ్గిపోయి క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, భాషోద్యమకారులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. భాషావేత్తలు, సాహితీవేత్తలతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి.. తెలుగు భాష పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిరసనలో ఆచార్య ప్రసాద్, కె.వి.ఎస్.మూర్తి, చిన్న సూర్యనారాయణ, ఎర్రం నాయుడు, శ్రీనివాస్, శ్రీధర్, ఆచార్య సూరప్పడు, మోహన్ తదితరులు పాల్గొని తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు భాషను రక్షించాలని నినాదాలు చేశారు.

ఉగ్రవాదం నశించాలి



గాంధీ విగ్రహం వద్ద సంఘీభావం తెలుపుతున్న కళాకారులు

బీచ్‌రోడ్డు: ‘ఆపరేషన్ సిందూర్’ పేరిట జరుగుతున్న సైనిక పోరాటానికి మద్దతు తెలియజేస్తూ విశాఖ కళాకారులు సంఘీభావం ప్రకటించారు. జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహంకు పెద్ద సంఖ్యలో కళాకారులు తరలివచ్చి.. భరతమాతకు జై, వందే మాతరం, టెర్రరిజం నశించాలి, సైనికులకు సలాం సలాం అంటూ నినాదాలు చేశారు. కళా సంఘాల ప్రతినిధులు యాక్మీ ప్రతాప్, సన్ మూర్తి, భయ్యా శ్రీనివాస్, బొడ్డేటి జగన్నాథరావు, చెన్న తిరుమలరావు, నాంచారయ్య, మను పల్లా తదితరులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని.. గాంధీ విగ్రహానికి ముందుగా పూలమాల వేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు మాట్లాడుతూ కళాకారులు కేవలం కళలకే అంకితం కాకుండా సామాజిక దృక్పథాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చే ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విశాఖలో కళాకారులు, కళా సంఘాలు ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములై.. భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమైక్యతను, స్ఫూర్తిని చాటిచెబుతున్నారన్నారు. క్యాలు జనార్దన్, లెఫ్టినెంట్ లోకేష్, మాజీ సైనికులు సుభాన్, ప్రకాష్, ఆడారి కిశోర్, తుని మణి, భూపతి, గరిమా తదితరులు పాల్గొన్నారు.

ఐస్‌బాల్ హాకీ ఓవరాల్ చాంప్ తెలంగాణ



తెలంగాణ ఆటగాళ్లను అభినందిస్తున్న బాండీ జాతీయ కార్యదర్శి లవ్‌కుమార్ జాదవ్

పెందుర్తి: రాష్ట్ర బాండీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 7వ జాతీయ ఫెడరేషన్ బాండీ(ఐస్‌బాల్ స్కేటింగ్ హాకీ) ఫెడరేషన్ కప్ టోర్నమెంట్‌లో తెలంగాణ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. సుజాతనగర్ సీ2 జోన్ పార్కులోని సింథటిక్ ఐస్ స్కేటింగ్ రింక్‌లో ఆదివారం ఫైనల్స్ జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హర్యానా, ఉత్తరప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో తెలంగాణ నాలుగు స్వర్ణాలు, రెండు రజత పతకాలతో ప్రథమస్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో గుజరాత్, తృతీయ స్థానంలో హర్యానా, నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్లు నిలిచాయి. విజేతలను జాతీయ బాండీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లవ్‌కుమార్ జాదవ్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ బాండీ అసోసియేషన్ కార్యదర్శి పి.ఎం.లక్ష్మీకుమారి, కమిటీ ప్రతినిధులు పి. మురళి, సుబ్బారెడ్డి, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

తడారిన గొంతులకు సాంత్వన

- దువ్వాడలో స్వచ్ఛంద సంస్థల ఆదర్శ సేవ
- రైల్వే ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్న సేవకులు
- నిమిషాల వ్యవధిలోనే వాటర్ బాటిళ్ల అందజేత



ఉచిత మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీలో పాల్గొంటున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



అగనంపూడి: భగభగ మండే ఎండలు.. ఉక్కపోతతో అల్లాడుతున్న సాధారణ రైలు ప్రయాణికులకు సేవా సంస్థలు ‘చల్లని’ సేవలందిస్తున్నాయి. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మధ్యాహ్న వేళ ఆగే రైళ్లలోని సాధారణ, దివ్యాంగ, మహిళా బోగీల్లోని ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. సేవే మార్గంగా భావించి.. రోజుకు 250 మంది ప్రయాణికులకు చల్లటి మినరల్ వాటర్ బాటిళ్లను అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నాయి. ముఖ్యంగా భువనేశ్వర్–బెంగుళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మిట్ట మధ్యాహ్నం దువ్వాడకు చేరుకుంటుంది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలో సేవకులు 250 మందికి కూలింగ్ వాటర్ బాటిళ్లను అందిస్తూ.. ప్రయాణికులతోపాటు రైల్వే ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు.

గత ఆరు నెలలుగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొన్ని సంస్థలు.. ఈ ఏడాది అధికంగా ఉన్న వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు సేవ చేయాలని సంకల్పించాయి. మొదట 45 రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేయాలని తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ వంటి సంస్థల ప్రతినిధులు సీనియర్ డీసీఎంకు విన్నవించుకున్నారు. అయితే మజ్జిగ పంపిణీ వల్ల తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీకి అనుమతించారు. దీంతో గత నెల 30న ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదట్లో అర లీటర్ బాటిళ్లు 500 వరకు పంపిణీ చేశారు. వారం రోజుల తర్వాత ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి.. లీటర్ ఉన్న చల్లని మినరల్ వాటర్ బాటిళ్లను స్థానికంగా కొనుగోలు చేసి అందిస్తున్నారు. ఈ సేవలు దాదాపు రెండు నిమిషాల వ్యవధిలోనే ప్రయాణికులకు చేరవేయడం విశేషం.

గత 18 రోజులుగా మానవ వికాస వేదిక కన్వీనర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి, తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం, మానవ వికాస వేదిక, స్పందన చేయూత ఫౌండేషన్, సత్యసాయి సేవా సంస్థ, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, మానవతా ఫౌండేషన్ వంటి సంస్థలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. వాల్తేరు డీఆర్‌ఎం

వీరే సేవకులు

లలిత్ బోరా, సీనియర్ డీసీఎం కె.సందీప్, దువ్వాడ కమర్షియల్ ఇన్‌చార్జి ఎం.ఎస్.రావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ తదితర రైల్వే ఉన్నతాధికారులు సహకరిస్తున్నారు. సేవా సంస్థల ప్రతినిధులు పి.శ్రీనివాస్, మురళీధర్‌రెడ్డి, రామకృష్ణ, బుచ్చిరాజు, డాక్టర్ మంగ, జాషువా, ఆదిల్ రెహ్మాన్ లతో పాటు వయోవృద్ధులు, చిన్నారులు కూడా పాల్గొని తమ వంతు సేవలను అందిస్తున్నారు.



మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీలో రోజూ పాల్గొంటున్న చిన్నారి హిమజ


సేవా సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు



దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచడం, అధికారుల అనుమతితో చిన్న చిన్న సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. వేసవితాపం అధికంగా ఉండడంతో మజ్జిగ పంపిణీకి అనుమతి కోరగా.. అధికారులు మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీకి అనుమతినిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాయి. సేవా సంస్థల ప్రతినిధులకు, సహాయ సహకారాలు అందిస్తున్న అధికారులకు కృతజ్ఞతలు.

–కంచుమూర్తి ఈశ్వర్, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు

సేవలోనే ఆనందం



దేశంలో మరే రైల్వేస్టేషన్‌లో లేని విధంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చే కార్యక్రమం జరుగుతోంది. మూడు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. మండే ఎండలో రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లను అందిస్తున్నప్పుడు పొందిన సంతోషం మరెందులోనూ కలగలేదు. ఎండలను సైతం లెక్కచేయకుండా చిన్నారులు, వృద్ధులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతుంటే కలిగే అనుభూతి చెప్పలేనిది.

–ఎం.ఎస్.ఎన్.మూర్తి, మానవ వికాస వేదిక కన్వీనర్

దేశంలో 15 శాతం గర్భిణుల్లో ఎక్లాంప్సియా

- ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుడు అనంత్ కారుమంచి
- రుషికొండలో ముగిసిన ఫోగ్సీ ‘వేవ్స్ 2025’సదస్సు



డాక్టర్ కారుమంచి అనంత్‌కి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ రాజు, చైర్‌పర్సన్ డాక్టర్ రాధ

మహారాణిపేట: రుషికొండలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఫోగ్సీ) ప్రతిష్టాత్మక ప్రెసిడెన్షియల్ కాన్ఫరెన్స్ ‘వేవ్స్ 2025’ ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు వెయ్యి మంది గైనకాలజిస్టులు పాల్గొని.. ప్రసూతి, స్త్రీల ఆరోగ్యంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా 100కు పైగా పరిశోధన పత్రాలు, పోస్టర్లను సమర్పించారు. ముగింపు కార్యక్రమంలో ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుడు డాక్టర్ అనంత్ కారుమంచి మాట్లాడారు. ప్రసూతి శాస్త్రం స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన కీలక విభాగమన్నారు. గర్భధారణ సమయంలో మహిళలు తప్పనిసరిగా అనేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మన దేశంలో సుమారు 15 శాతం మంది గర్భిణులు ఎక్లాంప్సియా వ్యాధి బారిన పడుతున్నారని, దీని కారణంగా మెటర్నల్, చైల్డ్ మోర్టాలిటీ రేట్లు కూడా ఎక్కువగా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధి సోకడానికి ముందే పసిగట్టే కచ్చితమైన విధానాలు మన దేశంలో ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. అయితే వ్యాధి వచ్చే అవకాశాన్ని ముందుగానే గుర్తించడానికి వీలైన ఒక టెస్ట్ ప్రస్తుతం అమెరికా, యూరప్‌లలో ప్రాచుర్యం పొందిందన్నారు. ఎక్లాంప్సియా ముందస్తు నిర్ధారణపై పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను చేసిన డాక్టర్ అనంత్ కారుమంచిని సదస్సులో పాల్గొన్న పలువురు వైద్యులు అభినందించారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ రాధ, డాక్టర్ సుబ్బరాజులతో కలిసి డాక్టర్ జి.ఆర్.కె. రాజు.. డాక్టర్ కారుమంచిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఫోగ్సీ అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తాండల్వాడ్కర్, సౌత్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పల్లనియప్పన్, మాజీ డీఎంఈ డాక్టర్ ఆర్.శశి ప్రభ, గైనక్ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సిహెచ్ పద్మావతి నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శిరీషా రాణి, డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవితో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పిల్లాడి విషయంలో గొడవ

- క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య
- మృతురాలు పార్వతీపురం మన్యం జిల్లా వాసి



సంఘటన స్థలం వద్ద పరిశీలన చేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

మధురవాడ: పిల్లాడిని చూసుకునే విషయంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. క్షణికావేశంలో భార్య కల్యాణ పార్వతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం బూర్జ గ్రామానికి చెందిన కల్యాణ గణేష్, అదే మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పార్వతి(25) ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో 2020లో సీతానగరం చర్చిలో వివాహం చేసుకున్నారు. కొన్నాళ్ల క్రితం బతుకుతెరువు కోసం నగరానికి వచ్చిన వారు బక్కన్నపాలెం ఎస్సీ కాలనీలోని భూలోకమాత ఆలయం వెనుక ఉంటున్నారు. గణేష్ పీఎంపాలెం ఆఖరి బస్టాప్ సమీపంలోని ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి నాలుగేళ్ల గగన్‌తో పాటు రెండు నెలల బాబు ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో గణేష్ పని నుంచి ఇంటికి వచ్చి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. ఆ సమయంలో భార్య రెండు నెలల బాబును అతని పక్కన పడుకోబెట్టింది. దీంతో గణేష్ తాను ఉదయం నుంచి అన్ని పనులతో పాటు వంట కూడా చేశానని.. బాబును చూసుకోవాలని భార్యతో చెప్పాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో పార్వతి ఇంటి లోపలికి వెళ్లి తలుపు గడియ పెట్టుకుంది. గతంలోనూ చిన్న చిన్న గొడవలు జరిగినప్పుడు ఆమె ఇలాగే లోపలికి వెళ్లి గడియ పెట్టుకునేదని గణేష్ పిల్లలతో పాటు బయటే ఉన్నాడు. సాయంత్రం 6 గంటలైనా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన గణేష్ తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి షాక్‌కు గురయ్యాడు. వెంటనే పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ముగిసిన సేంద్రియ మామిడి ప్రదర్శన

ఈ నెల 24, 25 తేదీల్లో మరోసారి మేళా



మామిడి ఐస్ ఫ్రూట్‌ను చిన్నారికి తినిపిస్తున్న తల్లిదండ్రులు



సేంద్రియ మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఆరిలోవ: విశాలాక్షినగర్ బీవీకే కళాశాల ఆవరణలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న సేంద్రియ మామిడి మేళా ఆదివారంతో ముగిసింది. ఇక్కడ ప్రదర్శించిన వివిధ రకాల మామిడి పండ్లకు భలే గిరాకీ లభించింది. అధిక సంఖ్యలో ప్రజలు మామిడి పండ్లు కొనడానికి ఆసక్తి చూపారు. ఉత్తరాంధ్ర జిల్లాల రైతులు ఎలాంటి రసాయనాలు లేకుండా పండించిన మామిడి పండ్లను ఇక్కడ ప్రదర్శించారు. బంగినపల్లి, కొబ్బరి అంటు, సువర్ణరేఖ, పంచదార కలిసాలు, పందూరి, అమృతం, కొత్తపల్లి అంటు, నాగులాపల్లి రసాలు, పెద్ద రసాలు, చిన్న రసాలు, పాపారాజు గోవా, ముంత మామిడి, ఇమామ్ పసందు తదితర రకాలకు చెందిన సేంద్రియ మామిడి పండ్లను ఇక్కడ ప్రదర్శించినట్లు సొసైటీ జాతీయ నేత జలగం కుమార్‌స్వామి తెలిపారు. సేంద్రియ మామిడి మేళాను నగరవాసులు విశేషంగా ఆదరించారన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో కూడా ఇక్కడ మరోసారి మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మేళాకు వచ్చే వారు వస్త్ర, గోనె సంచులు తీసుకురావాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు ‘విశాఖ లోకోమోటివ్’ సిద్ధం



లోకోను ట్రయల్‌రన్ కోసం జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: త్వరలో బనారస్‌లోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్‌లో జరగనున్న ఆలిండియా ఎలక్ట్రిక్ లోకో క్యాబ్ పోటీల్లో విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకోషెడ్ నుంచి ఆధునికీకరించిన లోకోమోటివ్ పాల్గొననుంది. ఈ పోటీల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన డబ్ల్యుఏపీ7 లోకోమోటివ్ నంబర్ 37419 ఆదివారం విజయవంతంగా తన ట్రయల్ రన్‌ను పూర్తి చేసుకుంది. వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఈ ట్రయల్ రన్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లోకోషెడ్ సిబ్బంది కృషిని అభినందించి నగదు బహుమతిని ప్రకటించారు. ఈ పోటీల్లో ఆధునిక సదుపాయాలు కలిగిన లోకోమోటివ్ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బి.షణ్ముఖరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బంది ఈ డబ్ల్యుఏపీ7 37419 ఎలక్ట్రిక్ లోకోను ‘లోకో పైలట్ ఫ్రెండ్లీ’గా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా అనేక కీలక మార్పులు చేపట్టారు. క్రూ డెస్క్ అభివృద్ధి, క్యాబ్‌లో ఎయిర్ కండిషనింగ్ డక్టింగ్, విశాలవంతమైన, సౌకర్యవంతమైన సీటింగ్, మోటార్ ఆపరేటెడ్ సైడ్ విండో షట్టర్స్, రేర్ వ్యూ మిర్రర్ కెమెరా, రేడియం స్టిక్కరింగ్‌తో కూడిన ఫ్లోరింగ్, డ్రైవర్ టూల్ బాక్స్, సర్దుబాటు చేయగల క్యాబ్ స్పాట్ లైట్ తదితర నూతన హంగులు సమకూర్చారు. ఈ లోకో మోటివ్ జాతీయ స్థాయి పోటీల్లో విశాఖపట్నం కీర్తిని ఇనుమడింపజేస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆలోచింపజేసిన ‘నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత’



నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత నాటికలో సన్నివేశం

మద్దిలపాలెం: సమాజంలో అత్యధిక హత్యలు వివాహేతర సంబంధాల వల్ల జరుగుతున్నాయని ఓ సర్వే ఆధారంగా రచించిన ‘నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత’ నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ వేడుక ప్రదర్శనలో భాగంగా ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఈ నాటికను సమితి కార్యదర్శి, కార్యక్రమ నిర్వాహకులు వై.ఎస్.కె.ఎన్.స్వామి నేతృత్వంలో ప్రదర్శించారు. 2022లో జాతీయ రచన పోటీల్లో ద్వితీయ రచన బహుమతి గెలుపొందిన ఈ నాటికను రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రదర్శించగా.. ఉత్తమ బహుమతులను చేజిక్కించుకుంది. కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సాహితీవేత్త ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, తెలుగు కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జి.త్రిమూర్తులు, సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి, కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు. రావులపాలేనికి చెందిన సీఆర్‌సీ వ్యవస్థాపకుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి(విక్టరీ)కి తెలుగు కళా సమితి 2025 పురస్కారాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల విజేతలకు బహుమతులు అందించారు. ఉత్తమ రచనగా ‘రిక్వెస్ట్’ నాటిక, ద్వితీయ ఉత్తమ రచనగా ‘క్రతువు’, తృతీయ ఉత్తమ రచనగా ‘మూగబోయిన సాక్ష్యం, జ్యూరీ రచనలుగా విషకుంభం, భని కోరని భ్రమణం నాటికలకు బహుమతులు లభించాయి.

ఏక తాటిపై కబడ్డీ సంఘాలు రావాలి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రలో రెండు కబడ్డీ సంఘాలు ఉండటంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారని... అందరూ ఒకేతాటి పైకి రావాలని ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ తనపై ఎలాంటి ఒత్తిడి లేదని, క్రీడాకారులు ఇబ్బంది పడకూడదన్నారు. హైకోర్టులో రిట్ పిటిషన్ అనంతరమే పూర్తి సమాచారం తనకు తెలిసిందన్నారు. జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధి, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కార్యదర్శిగా వ్యవహరించిన శ్రీకాంత్‌పై విచారణ జరిపిస్తామన్నారు. వెంకటరెడ్డిని తప్పుదారి పట్టించి కబడ్డీ సంఘం ఏర్పాటు చేయడమే గాక నేర కార్యకలాపాలకు పాల్పడిన శ్రీకాంత్‌పై రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థకు ఫిర్యాదు చేస్తామన్నారు. క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒకే సంఘంగా ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తామన్నారు.


క్రైం హెడ్ కానిస్టేబుల్ నిజాయితీ



పెళ్లి కొడుకుకి గొలుసుకు అందిస్తున్న కానిస్టేబుల్ గణేష్, దేవస్థానం ఉద్యోగి కనకరాజు

సింహాచలం: సింహగిరిపై ఓ పెళ్లికొడుకు పోగొట్టుకున్న అర తులం బంగారు మండ చైనును క్రైం హెడ్‌కానిస్టేబుల్ తిరిగి అతనికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. వివరాలివి.. నగరంలోని మర్రిపాలేనికి చెందిన గుండాల సాయి వివాహం సింహాచలం కొండపై గజపతి సత్రంలో ఆదివారం రాత్రి జరిగింది. ఉదయం 9 గంటల సమయంలో సాయి గజపతిసత్రం వద్దకు వచ్చాడు. పెళ్లి హడావిడిలో తన చేతికి ఉన్న అర తులం బంగారు గొలుసును పోగొట్టుకున్నాడు. అది సింహగిరిపై విధులు నిర్వర్తిస్తున్న గోపాలపట్నం క్రైం హెడ్‌కానిస్టేబుల్ ఎం.గణేష్‌కు దొరికింది. వెంటనే ఆయన దేవస్థానానికి చెందిన మైకుల ద్వారా అనౌన్స్ చేయించారు. విషయం తెలుసుకున్న సాయి గజపతిసత్రంలో విధులు నిర్వర్తిస్తున్న దేవస్థానం ఉద్యోగి కనకరాజును కలిశాడు. ఈ తరుణంలో తనకు దొరికిన గొలుసును హెడ్ కానిస్టేబుల్ గణేష్ అక్కడికి తీసుకొచ్చాడు. నిర్ధారణ చేసుకున్న అనంతరం దేవస్థానం ఉద్యోగి సమక్షంలో తిరిగి సాయికి అప్పగించారు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్‌కి పెళ్లి కొడుకుతోపాటు అతని బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	రూ.110
బ్రాయిలర్ (లైవ్)	రూ.130
స్కిన్	రూ.230
స్కిన్‌లెస్	రూ.240

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00